# రూ.70 కోట్ల స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధులతో
# కరీంనగర్ అభివృద్ధికి నూతన అధ్యాయం

**ప్రజల చిరకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్,జూలై 07(వాయిస్ టుడే): నగరాన్ని ఆధునిక,సుందర,సుస్థిర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధుల కింద రూ.70 కోట్లతో పలు ప్రతిష్ఠాత్మక అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ నిధుల మంజూరుకు విశేష కృషి చేసి నగర అభివృద్ధికి అండగా నిలిచిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు నగర ప్రజల తరపున,నగరపాలక సంస్థ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు.నగరంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న వరదలు,ట్రాఫిక్ రద్దీ,పార్కింగ్ కొరత, విద్యుత్ వ్యయం,రహదారులు,ప్రజా మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఈ ప్రాజెక్టులు రూపొందించామని తెలిపారు.ఇప్పటికే అన్ని పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ సిద్ధమవుతున్నాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను వేగంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రామ్‌నగర్,ఆర్ టిసి వర్క్‌షాప్ మరియు మంచిర్యాల చౌరస్తా వరద నివారణకు ఆధునిక హైడ్రాలిక్ డ్రైనేజీ వ్యవస్థ రూ.21.50 కోట్లు, టవర్ సర్కిల్‌లో మల్టీ లెవెల్ హైడ్రాలిక్ పార్కింగ్ నిర్మాణం రూ.25.00 కోట్లు, మున్సిపల్ భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు రూ.2.00 కోట్లు,సదాశివపల్లి జంక్షన్ ఆధునీకరణ రూ.3.00 కోట్లు, ఎకో-ఫ్రెండ్లీ స్పాంజ్ పార్క్ అభివృద్ధి రూ.3.00 కోట్లు,వల్లంపాహాడ్ మోడల్ వైకుంఠధామం నిర్మాణం రూ.2.50 కోట్లు,అల్కాపురి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం రూ.1.00 కోటి,యానిమల్ బర్త్ కంట్రోల్ మరియు జంతు సంక్షేమ కేంద్రం ఏర్పాటు రూ.2.00 కోట్లు,కేఆర్ కాలనీ నుండి వల్లంపాహాడ్ బ్రిడ్జ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు రూ.2.00 కోట్లు,సర్వేలు,డిజైన్‌లు, డీపీఆర్ ల తయారీ కోసం కన్సల్టెన్సీ సేవల రూ.1.50 కోట్లు ప్రజల అవసరాలే మా ప్రాధాన్యత. నాణ్యతలో రాజీ లేకుండా,పూర్తి పారదర్శకతతో,నిర్ణీత గడువులో ఈ పనులను పూర్తి చేసి కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం.ఈ నగర అభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా అందరూ భాగస్వాములు కావాలిఅని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.




## పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్**

హుజూరాబాద్ జూలై 7 (వాయిస్ టుడే): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ మహాసభలను ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా ఈ మహాసభలలో పాల్గొన్న టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి మాట్లాడుతూ ఏఐఎస్జీఎఫ్ మహాసభలను దిగ్విజయంగా నిర్వహించిన టాప్ర రాష్ట్ర శాఖను అభినందించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇబ్బందిని కలిగించే వాలిడేషన్ ఆఫ్ పెన్షన్ యాక్ట్ 2025ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వము తన మేనిఫెస్టోలో పొందుపరచిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారము రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల లోపు నూతన పి.ఆర్.సిని అమలు చేయకపోవడమే కాకుండా ఇప్పటివరకు నూతన పిఆర్సి నివేదికను తెప్పించు కోకపోవడం పట్ల ఆవేదనను వ్యక్తం చేస్తూ వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని జూలై 2023 నుండి నూతన పిఆర్సి ని అమలు చేయాలని కోరుతూ పెండింగ్ లో ఉన్నటువంటి డి ఏ లను వెంటనే విడుదల చేసి పెండింగ్ బిల్లులన్నింటినీ తక్షణమే మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సీవీపీ తగ్గింపును 15 సంవత్సరముల నుండి 11 సంవత్సరముల వరకు కుదించాలని అని ఆకాంక్షించారు. ఈ మహాసభలో టా ప్ర హుజరాబాద్ శాఖ అధ్యక్షుడు భారత ప్రభాకర్, దొంత హరి కిషన్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, బాధ్యులు తాటి పాముల కనకయ్య, బొంగోని వెంకటయ్య, గూడూరి స్వామి రెడ్డి, చాడ సమ్మిరెడ్డి, గాజర్ల బుచ్చి రాజం, పరాకుశం సనత్ కుమార్, చొల్లేటి మల్లారెడ్డి, శబ్ద ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగు సీజన్‌లో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న - సదానందం**



జమ్మికుంట జూలై 7 (వాయిస్ టుడే): ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో వ్యవసాయ సాగు సీజన్ ప్రారంభమైన సందర్భంగా రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం రైతులకు సూచించారు. ప్రభుత్వం అనుమతి పొందిన ఎరువుల దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా కొనుగోలు చేసిన రసీదు బిల్లును భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఎరువుల దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. దుకాణాల్లో ధరల జాబితా స్పష్టంగా ప్రదర్శించాలని, తగిన నిల్వలను ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. వ్యవసాయ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి తగు సలహాలు సూచనలు అందించాలని కోరారు. రైతులు, వ్యాపారులు పరస్పర సహకారంతో వ్యవసాయ సీజన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వైభవంగా సీత్లా పండుగ



వాయిస్ టుడే, జూలై 8, (పెద్దవంగర)బీ గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లా భవానీ పండుగను మండల వ్యాప్తంగా గిరిజనులు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని గిరిజన యువతులు, మహిళలు, యువకులు సంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ గ్రామ పొలిమేరలోని సీత్లా భవానీ ఆలయానికి చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో వచ్చే పెద్ద పుష్యాల కార్తె మొదటి వారంలో ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గిరిజనులు తెలిపారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, తండావాసులు ఆరోగ్యంగా ఉండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని సీత్లా భవానీని వేడుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి కుంట తండా సర్పంచ్ బానోతు జమున రాకేష్, కాండీయా తండా సర్పంచ్ ధరావత్ శంకర్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను కాపాడుతూ ఇటువంటి పండుగలను ఐక్యంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సీత్లా భవానీ ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండి, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తండావాసులు బద్రు, శ్రీను, రవి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య రక్షణకై ఓటు హక్కును కాపాడుకోండి

## SIR సవరణలో ప్రజలంతా భాగస్వాములుకండి

### యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు - బుడిగె శ్రీకాంత్

జమ్మికుంట జూలై 7 (వాయిస్ టుడే) : భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' (Special Intensive Revision - SIR) చైతన్యం తీసుకురావడానికి, నకిలీ ఓట్లను అరికట్టడానికి హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మంగళవారం రోజు ఇంటింటి ప్రత్యేక సమగ్ర సవరణ గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుముక లాంటి ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయడమే ఈ ప్రత్యేక సర్వే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలను అరికట్టడానికి, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా ఉండడానికి బూత్ లెవల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని బి ఎల్ ఓ లను కోరారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి ఒక్క యువతీ, యువకుడు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలనీ, రాబోయే భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందనీ స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించి, అలాగే ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఉన్న నకిలీ ఓట్లను గుర్తించి, ఒక్క చోట మాత్రమే ఉండే విధంగా అధికారులు చూడాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులు (BLO) ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు పూర్తి సమాచారం అందించి వారికి సహకరించాలనీ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని బూత్ స్థాయి అధికారులకు తెలిపారు. అదే విధంగా వార్డుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో, ఉన్న నిరక్షరాస్యులకు, వృద్ధులకు ఓటు హక్కు పరిశీలనలో యూత్ కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికులుగా ఉండి ప్రజలకు తోడ్పాటు అందించాలని తెలిపారు. అంతేకాకుండా, యువకులు, ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్ ద్వారా కూడా ఓటర్ సహాయక కేంద్రం హెల్ప్ లైన్ లేదా కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ voters.eci.gov.in లో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి రవి, కాంగ్రెస్ పార్టీ 9వ వార్డు బి ఎల్ ఏ పొనగంటి కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంశెట్టి రమేష్, ఉడుగుల మల్లయ్య, యెబుషి ఓదెలు, నలగాష రాజకొమురయ్య, కోరే సదానందం తదితరులు పాల్గొన్నారు.







## ఘనంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు జన్మదిన వేడుకలు

కరీంనగర్, జూలై 07(వాయిస్ టుడే): తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ పుట్టినరోజు వేడుకలను జిల్లా రక్షణ సేన నాయకులు రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా తెలంగాణ రక్షణ సేన ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హోసింగ్ బోర్డు కాలనీలో గల శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధుల ఆశ్రమంలో పండ్ల పంపిణీ, స్వీట్స్ పంపిణి చేశారు.టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బాసవేణి రాజేందర్ ఆధ్వర్యంలో సుభాష్ నగర్ లోని బుట్టి రాజారాం కాలనీలోని భక్త హనుమాన్ ఆలయంలో అర్చన చేసి తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ కు భగవంతుడు అయురారోగ్యాలను,అష్ట ఐశ్వర్యాలను, సుఖ సంతోషాలను ఇవ్వాలని జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్,కుతాడి శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి,బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, మనకోండుర్ నియోజకవర్గ ఇంచార్జ్ బుడిగె పర్శారం గౌడ్,చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, గాలిపల్లి రత్నాకర్ చారి,జంగ అపర్ణ,శిరిష రమేష్,పుల్లురి అంజాలి, గర్షకుర్తి విద్యాసాగర్,అసియా సుల్తాన్, మడిపల్లి వినిత్,కుతాడి రజిత,యండి సల్మ,అతహర్,జైపాల్ రెడ్డి,యండి రజీ, పాల్గొన్నారు.



## ప్రవాసీ ప్రజావాణిలో చొప్పదండి ఎమ్మెల్యే, గల్ఫ్ ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు మేడిపెల్లి సత్యం

కరీంనగర్,జూలై 07(వాయిస్ టుడే):హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్ లో సిఎం ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే,గల్ఫ్ ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యులు మేడిపెల్లి సత్యం పాల్గొని సహాయం కోసం వచ్చిన భాదితుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికలకు అండగా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం బాధితులకు బరోసా ఇచ్చారు.



## మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ పి. హరిప్రసాద్

జమ్మికుంట జూలై 7 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని మంగళవారం రోజు కరీంనగర్ ట్రైనీ కలెక్టర్ పి. హరిప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) , మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానం చేసి స్వాగతం పలికారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ట్రైనీ కలెక్టర్‌ను ఆహ్వానించి, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి , మేనేజర్ జి. రాజిరెడ్డి , గౌరవ కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ం



## ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలు

**మందకృష్ణ మాదిగ ఆశయాలే స్ఫూర్తి**

కొనరావుపేట ,జూలై 7(వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా, కొనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మరియు మందకృష్ణ మాదిగ గారి జన్మదిన వేడుకలను మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కేంద్రంలో జెండాను ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ గారి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాదిగ సంఘం అధ్యక్షులు దొబ్బల సంజీవ్ మాట్లాడుతూ.. "డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన రిజర్వేషన్లు ఎస్సీ ఉపకులాలకు సమానంగా అందలేదనే బాధతో, 1994 జులై 7న మందకృష్ణ మాదిగ గారు ఎమ్మార్పీఎస్‌ను స్థాపించారు. 32 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో నేడు మాదిగ ఉపకులాలు తమ హక్కులను, వాటాను పొందుతున్నాయి" అని పేర్కొన్నారు.కేవలం రిజర్వేషన్ల సాధనే కాకుండా, భవిష్యత్తులో మాదిగ ఉపకులాలన్నీ రాజకీయంగా ఎదిగి 'రాజ్యాధికారం' దిశగా సాగాలని ఆయన పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంటఎల్లి నాగరాజు, మాదిగ సంఘం నాయకులు దొబ్బల లింగయ్య, రాము, స్వామి, నరేష్, ప్రణయ్, మహేష్, ప్రభాకర్, సంజీవ్, రాజు, బొట్టు రాజు, పరశురాం, దండు నరసయ్య, ఓద్యారపు రాజయ్య తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.